సాక్షి
పార్వతీపురం మన్యం
బుధవారం । 6 । డిసెంబర్ । 2023



చిరుధాన్యాల పంటలో నీరుండకూడదు

పంట పొలాల్లో నీరు లేకుండా చూడాలని వ్యవసాయ శాస్త్రవేత్త లక్ష్మణ్ సూచించారు. - 8లో



కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం

పూర్వకాలంలో ప్రతి రైతు కళ్లం వద్ద, ఇంటి వద్ద నాటు కోళ్లను పెంచేవారు. దీని వల్ల రైతులకు అదనపు ఆదాయం వచ్చేది. - 8లో



రైతులకు అండగా ప్రభుత్వం

తుఫాన్ ప్రభావం వల్ల నూర్పు చేపట్టిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు అండగా ప్రభుత్వం ఉందని జిల్లా వ్యవసాయ శాఖ జేడీ వీటీ రామారావు అన్నారు. - 8లో

తప్పిన ముప్పు

- మిచాంగ్ తుపానుతో నష్టం కనిష్టం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందస్తు చర్యలతో సత్ఫలితాలు
- క్షేత్రస్థాయిలో అధికారుల పర్యటనలు
- పంటల సంరక్షణ, ధాన్యం భద్రతపై పలు సూచనలు
- నూర్పిడిచేసిన ధాన్యం ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: మిచాంగ్ తుపాను ముప్పు ఉమ్మడి విజయనగరం జిల్లాకు తప్పింది. భారీ వర్షాలు కురవకపోవడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. మిచాంగ్ తుపాను ప్రభావంతో ఆదివారం అర్ధరాత్రి నుంచి మొదలైన వర్షాలు మంగళవారానికి ఎక్కువయ్యాయి. విజయనగరం జిల్లాలో సోమవారం సాయంత్రానికి సగటున 25.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ 30.9 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. పార్వతీపురం మన్యం జిల్లాలో ఓ మోస్తరు వర్షాలు అక్కడక్కడాకురుస్తున్నాయి. ఈ వర్షాల వల్ల పంటలు నష్టపోకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన ముందస్తు చర్యలు సత్ఫలితాలనిచ్చాయి. రైతులు కూడా పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా కాలువలు తీయడం పంటకు మేలు జరిగింది. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్లతో వర్చువల్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. దీంతో అప్రమత్తమైన జిల్లా అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో సమష్టిగా పనిచేసింది. మిచాంగ్ తుపానుతో పంటలు, ప్రాణ, ఆస్తి నష్టాలు కనిష్ఠ స్థాయిలోనే ఉన్నాయి. వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు పంటల రక్షణపై అవగాహన కల్పిస్తున్నారు. ధాన్యం నూర్పిడి చేసిన వారి వద్ద నుంచి ఆర్‌బీకే సిబ్బంది ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేస్తున్నారు. ఆ ధాన్యాన్ని వెనువెంటనే రైసుమిల్లులకు తరలిస్తున్నారు. ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్లు నాగలక్ష్మి, నిషాంత్‌కుమార్ ఎప్పటికప్పుడు టెలీకాన్ఫరెన్స్ ద్వారా క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించారు.



సాలూరు పట్టణంలోని కాలువల్లో పూడికల తొలగింపును పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

'మిచాంగ్'పై అప్రమత్తం

- జిల్లా కేంద్రంలో కాలువపై అక్రమ కట్టడాలు తొలగింపు
- 3,607 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- పాఠశాలలకు బుధవారం కూడా సెలవు ప్రకటించిన అధికారులు

పార్వతీపురం టౌన్: మిచాంగ్ తుఫాన్‌పై కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాలోని ప్రధాన పట్టణాలైన పార్వతీపురం, సాలూరు, పాలకొండ, వీరఘట్టం, కురుపాం, తదితర ప్రాంతాల్లో సేవలందించేందుకు సిద్ధమయ్యారు. వర్షపునీరు ప్రవహించే కాలువలపై ఉన్న అక్రమ కట్టడాలను జేసీబీలతో మంగళవారం తొలగించారు. క్షేత్రస్థాయిలో సహాయక చర్యలు అందించేందుకు వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, వలంటీర్లు అప్రమత్తమయ్యారు. పోలీస్, అగ్నిమాపక సిబ్బంది సైతం సహాయక చర్యలకు సన్నద్ధమయ్యారు.



పార్వతీపురం పట్టణంలో వర్షపునీరు మళ్లింపునకు జేసీబీతో కాలువలోని పూడికలు తీయిస్తున్న అధికారులు

3,607 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

జిల్లాలో రైతులు నూర్పిడి చేసిన 3,607 మెట్రిక్ టన్నుల ధాన్యంను అధికారులు కొనుగోలు చేశారు. ఇందులో 200 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇతర జిల్లాల్లోని మిల్లులకు పంపించారు.

నేడు కూడా పాఠశాలలకు సెలవు

తుఫాన్ కారణంగా పార్వతీపురం మన్యం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ బుధవారం కూడా సెలవు ప్రకటించారు. కలెక్టర్ నిషాంత్ కుమార్ ఆదేశాల మేరకు ముందస్తు చర్యల్లో భాగంగా సెలవు ప్రకటించినట్టు తెలిపారు.



దత్తిరాజేరు మండలంలో రామచంద్రాపురం నుంచి రైస్ మిల్లుకు ధాన్యాన్ని తరలిస్తున్న అధికారులు



వీరఘట్టం మండలం హుస్సేనుపురంలో మంగళవారం రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యంను మిల్లుకు తరలిస్తున్న అధికారులు

రైతుల కళ్లాలకు వెళ్లి కొనుగోలు చేస్తున్నాం



తమ వద్ద ధాన్యం ఉన్నాయని రైతులు ఆర్‌బీకేలలో చెప్పిన వెంటనే వ్యవసాయ శాఖ, రెవెన్యూ, ఆర్‌బీకే సిబ్బంది సంయుక్తంగా వెళ్లి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. మేము వెంటనే లారీలను సమకూర్చి రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యంను మిల్లులకు తరలిస్తున్నాం. ఇంత వరకు జిల్లా వ్యాప్తంగా 5,085 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. బుధవారం నుంచి ధాన్యం కొనుగోలు వేగవంతం చేసేలా కార్యచరణ చేపడుతున్నాం.

– దేవుళ్ల నాయక్, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్, పార్వతీపురం మన్యం జిల్లా

ధాన్యం కొనుగోలు చేస్తున్నారు...



తుపాను వల్ల ఏ ఒక్క రైతు కూడా నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గ్రామ సచివాలయం, ఆర్‌బీకే వారు వచ్చి ముందుగానే తుపాను గురించి చెప్పారు. పంటలు ఎలా కాపాడుకోవాలో సూచించారు. ఇంత వరకూ నూర్పులు అయిపోయిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు.

– విసినిగిరి అప్పలనాయుడు, రైతు, సీతారాంపురం, గజపతినగరం మండలం

బెంగ తీరింది



వరి కోతలు పూర్తయ్యాయి. నూర్పిడి చేశాం. కళ్లాల్లోనే ధాన్యం ఉండిపోవడంతో ఆందోళన చెందాం. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి తక్షణమే రైతులు వద్ద ఉన్న ధాన్యం ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేయాలని ఆదేశాలివ్వడంతో బెంగ తీరింది. ఊరిలోని ఆర్‌బీకేలో ఐదు మెట్రిక్ టన్నులు ధాన్యం అమ్ముకోలిగాను.

– అంబల్ల చంద్రశేఖర్, గొల్లలములగాం, చీపురుపల్లి మండలం

ప్రభుత్వం ఆదుకుంది



వరి నూర్పిడి చేసి కళ్లంలోనే 600 బస్తాల ధాన్యం నెట్టు వేయించాను. ఈ సమయంలోనే తుపాను ప్రభావంతో వర్షాలు మొదలయ్యాయి. ఏం చేయాలోనని ఆందోళన చెందాను. ప్రభుత్వం ఆదుకుంది. మా ధాన్యం అంతా ఆర్‌బీకే ద్వారా అధికారులు కొనుగోలు చేశారు. సకాలంలో రైస్‌మిల్లుకు తరలించడానికి చర్యలు తీసుకున్నారు.

– ఉదమల సత్యనారాయణ, రైతు, ఇప్పలవలస, సీతానగరం మండలం

నూర్పిడి వాయిదా వేసుకున్నాం

తుపాను ప్రభావంతో ఆస్తి, ప్రాణ, పంట నష్టం జరగకుండా ఉండేలా ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలు రైతులకు ఎంతో ఉపయోగపడ్డాయి. మూడు రోజులుగా సచివాలయం, మండల పరిషత్, వ్యవసాయ శాఖ సిబ్బంది మా గ్రామానికి వచ్చి పలు సూచనలు చేశారు. ప్రస్తుతం వరి పంట కోత దశకు వచ్చింది. కోతలు, నూర్పిళ్లు వాయిదా వేసుకున్నాం.

– వంజరాపు కొండలరావు, రైతు, బుక్కూరు, పాలకొండ మండలం

పలు ప్రాంతాల పరిశీలన

సాలూరు: మిచాంగ్ తుఫాన్‌పై ప్రజలను అప్రమత్తం చేసేందుకు సాలూరు పట్టణంలోని రామాకాలనీ, శివరాంపురం, పాచిపెంట మండల కేంద్రం, అమ్మవలస గెడ్డ తదితర ప్రాంతాలను కలెక్టర్ నిషాంత్‌కుమార్, పార్వతీపురం ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాచిపెంట, సాలూరు మండల కేంద్రాల్లో అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు బాలమురళీకృష్ణ, రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్ జయరాం, ఎంపీడీఓలు పార్వతి, లక్ష్మీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



రేగిడి మండలం అంబఖండిలో రైతులను అప్రమత్తం చేస్తున్న ఏఈఓ విజయలక్ష్మి



జామి మండలం తానవరంలో కళ్లాల్లో ఉన్న ధాన్యం నిల్వలను పరిశీలిస్తున్న తహసీల్దార్ హేమంత్‌కుమార్

కూలిన పెంకుటిల్లు

పాచిపెంట: తుపాను వర్షాలకు పాచిపెంట మండలంలోని గరిసిగుడ్డి పంచాయతీ చిమిడివలసలో ఓలిక సాంబమూర్తికి చెందిన పెంకుటిల్లు పాక్షికంగా కూలింది. అలాగే, మూటకూడు పంచాయతీలో పశువుల శాలలు కూలిపోవడంతో ఓలిక బుచ్చయ్యకు చెందిన రెండేళ్ల ఆవుదూడ, తుమారావల్లి పంచాయతీలో కేరంగిపెంటయ్య చెందిన ఓ మేక మృతి చెందాయి.

సకాలంలో ఆదుకున్నారు



వారం రోజుల కిందట ధాన్యం నూర్పు చేశాను. ఇంతలో తుఫాన్ వస్తుందని పత్రికల్లో, టీవీ వార్తల్లో చూసి చాలా భయపడ్డాను. నూర్పు చేసిన 77 బస్తాలు (80 కిలోల) కళ్లంలో ఉండిపోయాయి. వర్షం పడితే తడిసిపోతాయని ఆందోళన చెందాను. ఈ విషయం ఆర్‌బీకేలో చెప్పాను. నేను చెప్పిన 24 గంటల్లో ధాన్యం కొనుగోలు చేసి నాకు రసీదు ఇచ్చారు. ,నా ధాన్యం సకాంలో సకాలంలో కొనుగోలు చేసి ఆదుకున్నారు.

– సతివాడ చిన్నంనాయుడు, రైతు, తెట్టంగి, వీరఘట్టం మండలం

న్యూస్‌రీల్

ఆరోగ్యం జాగ్రత్త!

- జిల్లా హెల్త్ ప్రోగ్రామ్ అధికారి డా టి.జగన్మోహనరావు



కళ్లికోటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ జగన్మోహనరావు

కొమరాడ: వాతావరణంలో మార్పులు నేపథ్యంలో ప్రజలందరూ ఆరోగ్యజాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా హెల్త్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. నాగావళి నదీ పరివాహక ప్రాంతంలోని కళ్లికోట, దుగ్గి గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. చలిగాలులు వీస్తున్నాయని, జలుబు, దగ్గు తదితర వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. వృద్ధులు, చిన్నారులు బయట వెళ్లేటప్పుడు మాస్క్ ధరించాలని, ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటి తాగాలని సూచించారు. ఎంపీడీఓ మల్లికార్జునరావు మాట్లాడుతూ భారీవర్షాలు కురిస్తే వరదలు వచ్చే అవకాశం ఉందని, నదీతీరం వైపు ఎవరూ వెళ్లవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ జామి నారాయణస్వామి, సర్పంచ్ దత్తి మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి నరేష్, సచివాలయ, వైద్య సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

72 మంది ఉద్యోగాలకు ఎంపిక



జాబ్‌మేళాలో ఉద్యోగాలు పొందిన నిరుద్యోగులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, కంపెనీల ప్రతినిధులు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు అనూహ్య స్పందన లభించింది. జాబ్‌మేళాను ఆర్‌జేడీ డాక్టర్ సీహెచ్ కృష్ణ ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. విశాఖకు చెందిన వికాస్ కంపెనీ, సోలార్ ఏక్టీవ్‌పారం, తునికి చెందిన డెక్కన్ కెమికల్ కంపెనీల ప్రతినిధులు హాజరైన నిరుద్యోగ యువతీ యువకులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. జాబ్‌మేళాకు 210 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 141 మంది హాజరయ్యారు. వీరిలో 72 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య, ఎన్ఎస్ఎస్ పీఓ బి.త్రినాథ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

తుఫాన్ సహాయక చర్యలపై సమీక్ష



తుఫాన్ ప్రభావంపై కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: తుఫాన్ ప్రభావం తగ్గే వరకు జిల్లాలోని అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర సూచించారు. తుఫాన్ సహాయక చర్యలపై కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్, ఇతర జిల్లా అధికారులతో ఫోన్‌లో సమీక్షించారు. వర్షపాతం నమోదు వివరాలు, రైతులకు అందుతున్న సహాయక చర్యలపై ఆరా తీశారు.

పంట సంరక్షణే కీలకం

గుమ్మలక్ష్మీపురం/కురుపాం: మిచాంగ్ తుఫాన్ వర్షాల నుంచి పంటను సంరక్షించుకోవాలని రస్తా కుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ టీఎస్ఎస్‌కే పాత్రో, వాతావరణ విభాగం శాస్త్రవేత్త కె.ప్రశాంత్ మంగళవారం ఒక ప్రకటనలో రైతులకు సూచించారు. చిరుధాన్యాల పంటలో వర్షపునీరు నిల్వలేకుండా చూడాలన్నారు. కోసిన వరి పనలపై 2 శాతం ఉప్పు ద్రావణాన్ని (లీటరు నీటికి 20 గ్రాముల ఉప్పు) పిచికారీ చేయాలన్నారు. దీనివల్ల ధాన్యం మొలకరాదని, బూజుపట్టే అవకాశం ఉండదన్నారు. వేరుశనగ, కంది, పెసర, మినుము పంటల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాలు ఆగిన ఒక వారంరోజుల తర్వాత 19:19:19 లేదా కేఎన్‌ఓత్రిను పొలంలో పిచికారీ చేయాలని పేర్కొన్నారు. వేరుకుళ్లు తెగుళ్లు తట్టుకునేందుకు హెక్సాకొనజోల్ 2 మిల్లీలీటర్లు లేదా ప్రాపికొనజోల్ ఒక మిల్లీ లీటరును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కంది పంటలో కాయతొలుచు పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ లీటరు నీటికి కలిపి వర్షం ఆగిన వారం రోజుల తరువాత పిచికారీ చేయాలని సూచించారు.

తీరిన వంతెన చింత

- భీంపురం సమీపంలో వంతెన నిర్మాణం పూర్తి
- ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి కృషితో సాకారం
- పార్వతీపురం–సీతంపేట ఐటీడీఏల పరిధిలో 180 గ్రామాల ప్రజలకు ప్రయోజనం
- డోలీ కష్టాలకు చెక్
- సత్వర సేవలకు వెసులబాటు



వంతెనలేక డోలీపై రోగిని నీలకంఠాపురం పీహెచ్‌సీకి తీసుకెళ్తున్న భీంపురం గ్రామస్తులు (ఫైల్)



వంతెన నిర్మించకముందు లోయగా ఉన్న ప్రదేశం

కురుపాం: భీంపురం వాగు... వర్షాకాలం వస్తే తరచూ వార్తల్లో కనిపించే, వినిపించే పేరు. ఏజెన్సీలో వర్షం కురిస్తే చాలు.. కొండల నుంచి జాలువారిన వర్షపు నీరు భీంపురం వద్ద ఉన్న వాగులో చేరుతుంది. అదికాస్తా ఉగ్రరూపం దాల్చుతుంది. వాగుపై వంతెన లేకపోవడంతో రాకపోకలకు పార్వతీపురం–సీతంపేట ఐటీడీఏల పరిధిలోని సుమారు 180 గిరిజన గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడేవారు. వాగు పొంగితే బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయేవి. ఇటు నీలకంఠాపురం, మొండెంఖల్ పీహెచ్‌సీలకు రావాలన్నా, అటు శ్రీకాకుళం జిల్లాలోకి వెళ్లాలన్నా వాగు దాటాల్సిందే. అత్యవసర వేళ నరకయాతన. ప్రాణాలను పణంగా పెట్టి వాగు దాటేవారు. గిరిజన ఉత్పత్తులను వారపు సంతలకు తరలించాలన్నా కష్టాలు తప్పేవికావు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కురుపాం మండలంలోని ఒబ్బంగి పంచాయతీకి వెళ్లిన ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి దృష్టికి స్థానిక గిరిజనులు భీంపురం వాగు సమస్యను తెలియజేశారు. వంతెన అవసరాన్ని వివరించారు. అంతే... ఆమె వెంటనే అధికారులతో మాట్లాడారు. వాగుపై వంతెన నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. సమస్యను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి స్వయంగా వివరించారు. దీంతో ఆయన స్పందించి వంతెన నిర్మాణానికి ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిధులు రూ.80 లక్షలు మంజూరు చేయించారు. ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారులు పనులు ప్రారంభించి సకాలంలో వంతెన నిర్మాణాన్ని పూర్తి చేశారు. తాత్కాలికంగా రాకపోకలు సైతం ఆరంభయ్యాయి. కొద్దిరోజుల్లో వంతెనను జాతికి అంకితం చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏళ్లనాటి సమస్యకు పరిష్కారం

భీంపురం వంతెన సమస్య ఏళ్లనాటిది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సమస్యను పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. గిరిజనుల దీర్ఘకాలిక సమస్యను కనీసం పట్టించుకోలేదు. అత్యవసర వేళ గిరిజనులకు డోలీ కష్టాలు తప్పేవికావు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషితో సమస్యకు చక్కటి పరిష్కారం లభించింది. నాణ్యతాప్రమాణాలతో వంతెన నిర్మాణం పూర్తయింది. దీంతో పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని భీంపురం, నీలకంఠాపురం, వాడకొయ్యి, సుక్కుగూడ, జరడ, గాణలి, తిత్తిరి, ఒబ్బంగి, ధర్మలక్ష్మీపురం, పొక్కిరి, దండుసూర తదితర గ్రామాల తోపాటు సీతంపేట ఐటీడీఏ పరిధిలో గురండి, ఈతమానుగూడ, సరాబువలస, పుట్టిగాడిగూడ, కోమటిగూడ, సీడుమానుగూడ, బంజరుగూడ, నెల్లిగూడ, సావిసివలస, చినబగ్గ తదితర వందల సంఖ్యలో గిరిజన గూడల ప్రజలు సంతోష పడుతున్నారు. పంటలను తరలించుకునేందుకు 'మార్గం' సుగమం అయ్యిందంటూ సంబరపడుతున్నారు. పంటలను అటు సీతంపేట ఐటీడీఏ పరిధిలోని వారపు సంతలకు, ఇటు పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని వారపు సంతలకు తీసుకెళ్లి విక్రయించుకునే అవకాశం కలిగిందని, విద్య, వైద్యసేవలు సత్వరమే అందుతాయని హర్షం వ్యక్తంచేస్తున్నారు.



భీంపురం వద్ద నిర్మించిన వంతెన



వంతెన మీదుగా సాగుతున్న రాకపోకలు



వంతెన పనులకు భూమిపూజ చేసిన కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి (ఫైల్)

మాట ఇస్తే మడమ తిప్పం

మాట ఇస్తే మడమ తిప్పేది లేదు. నా ముందు ఉన్న ఏకైక లక్ష్యం గిరిజాభివృద్ధే. భీంపురం వంతెన లేక పోవడంతో వైద్య సేవలు అందక చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు మృత్యువాత పడిన సందర్భాలు ఉన్నాయి. గత ప్రభుత్వం పట్టించుకోలేదు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషిచేశాను. అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి సకాలంలో వంతెన నిర్మాణం పూర్తిచేశారు. మాది మాట ఇస్తే మడమ తిప్పని ప్రభుత్వం.

– పాముల పుష్పశ్రీవాణి, ఎమ్మెల్యే కురుపాం

దశాబ్దాకల నెరవేరింది

భీంపురంవాగుపై వంతెన నిర్మాణం గిరిజనుల దశాబ్దాల కల. గత ప్రభుత్వాలు గిరిజనాభివృద్ధిని పట్టించుకున్న దాఖలా లేవు. దీంతో వందల సంఖ్యలో గిరిజన గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడేవారు. ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించి నిర్మాణ పనులు వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. ఇక నుంచి మెరుగైన సేవలు అందుతాయి.

– బిడ్డిక అన్నాజీరావు, కురుపాం మండల వైస్ ఎంపీపీ, గిరిజన సంఘం నాయకుడు, దండుసూర గిరిజన గ్రామం

వారం రోజుల్లో వంతెన ప్రారంభం

ఒబ్బంగి పంచాయతీ పరిధిలోని భీంపురం వద్ద రూ.80 లక్షలతో వంతెన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మరో వారంరోజుల్లో ఎమ్మెల్యే చేతుల మీదుగా వంతెనను ప్రారంభిస్తాం. గిరిజన గ్రామాల ప్రజలకు వరదనీటి కష్టాలు ఉండవు. రాకపోకలకు మార్గం ఏర్పడింది. గిరిజన ఉత్పత్తులను సులభంగా తరలించుకునే అవకాశం కలిగింది.

– అప్పారావు, ఐటీడీఏ ఇంజినీరింగ్ విభాగం ఏఈ

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి



పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, అర్చన నిర్వహించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం వెనుక ఉన్న వేప,రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. ఆలయ కార్య నిర్వహణాధికారిణి కేఎల్.సుధారాణి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

250మద్యం సీసాల పట్టివేత



పట్టుబడిన మద్యం సీసాలు

బలిజిపేట: అక్రమంగా తరలిస్తున్న 250మద్యం సీసాలను పట్టుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నారాయణపురం గ్రామానికి చెందిన ఎస్.తిరుపతిరావు బలిజిపేట–పదమాయవలస రహదారిలో నారాయణపురం రోడ్డు జంక్షన్ వద్ద మద్యం సీసాలు పట్టుకుని ఉండడం గుర్తించిన పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని తిరుపతిరావుపై కేసు నమోదుచేశారు.

కొట్లాటలో వ్యక్తికి గాయాలు

పార్వతీపురంటౌన్: పట్టణంలోని బంగారమ్మ కాలనీలో మంగళవారం జరిగిన కొట్లాటలో ఓ వ్యక్తి గాపడ్డాడు. దీనిపై పార్వతీపురం జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలావున్నాయి. బంగారమ్మ కాలనీలో నివాసముంటున్న పి.శ్రీధర్ పట్టణంలోని ఆర్‌ఓ ప్లాంట్‌లో పనిచేస్తున్నాడు. తన ద్విచక్ర వాహనాన్ని ప్రతిరోజూ ఇంటి ముందు పార్కింగ్ చేస్తాడు. అదే వీధిలో నివాసం ఉంటున్న తుమరాడ కిరణ్ ఆటో నడుపుతూ ప్రతిరోజూ అదే దారిలో వస్తుంటాడు. తన ఇంటి ముందు బైక్ ఉండడంతో ఆటో హార్న్ కొడుతున్నాడు. ఆ సమయంలో శ్రీధర్ భోజనం చేస్తున్న సందర్భంగా బయటకు వచ్చి బైక్‌ను పార్కింగ్ నుంచి తీయడానికి సమయం పట్టింది. ఆలస్యంగా వచ్చిన కారణంగా ఆటో డ్రైవర్ కిరణ్ శ్రీధర్‌ను రాడ్డుతో కొట్టగా తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



గాయపడిన శ్రీధర్

గోముఖి నదిలో పడి వృద్ధురాలి మృతి

మక్కువ: మండలంలోని పాత లోవరకండి గ్రామానికి చెందిన వృద్ధురాలు ఒప్పంగి పారమ్మ (74) గోముఖి నదిలో పడి మంగళవారం మృతి చెందింది. ఈ సంఘటనపై ఎస్సై జి.పైడిరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డి.శిర్లాం గ్రామం సమీపంలో గోముఖి నదిలో ఓ మహిళ మృతి చెందినట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, ఎస్సై పైడిరాజు సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పారమ్మ(ఫైల్)

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹80	₹130	₹140

చిరుధాన్యాల పంటలో నీరుండకూడదు

- ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ కెల్ల లక్ష్మణ్



జొన్న పంటలో చేరిన వర్షపు నీరు

విజయనగరం ఫోర్ట్: చిరుధాన్యాల పంట పొలాల్లో నీరు లేకుండా చూడాలని ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ కెల్ల లక్ష్మణ్ సూచించారు. మిచాంగ్ తుఫాన్ కారణంగా జిల్లా వ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాల వల్ల వివిధ రకాల పంట పొలాల్లో నీరు చేరిన నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన మంగళవారం విపులంగా తెలియజేశారు. జాగ్రత్తల గురించి ఆయన తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. జొన్న పంట పూత, గింజ ఏర్పడే దశలో ఉన్నప్పుడు బూజు తెగులు రాకుండా ప్రొపైకొనజోల్ మందు లీటరు నీటికి 0.5 మి.లీ చొప్పున కంకులపై రెండుసార్లు వారం వ్యవధిలో పిచికారీ చేయాలి. జొన్న పంట కోసి పొలాల్లో ఉన్నప్పుడు లీటరు ఉప్పుడు ద్రావణం 20 గ్రాములు కలిపి కోసిన పంట కంకులపై వెదజల్లడం ద్వారా బూజు, కంకిపై గింజలు మొలకరాకుండా నివారించడానికి అవకాశం ఉంటుంది. పంట పొలంపైన వాలిపోయినప్పుడు, మొక్కలను పైకి జరిపి గుంపుగా నిలబెట్టుకుని కాపాడుకోవాలి. రాగి, కొర్ర పంటలలో అగ్గి తెగులు నివారణకు లీటరు నీటికి కార్బన్డిజం ఒక గ్రాము కలిపి మొక్క బాగా తడిచే విధంగా పిచికారీ చేయాలి.

వేరుశనగ

కోతకు సిద్ధంగా ఉన్న వేరుశనగ పంటను వర్షాలకు ముందు పీకరాదు. కాయలు వర్షానికి తడవకుండా భద్రపరుచుకోవాలి. పొలంలో నిలిచి ఉన్న నీరు మురుగు కాలువల ద్వారా బయటకు వెళ్లేలా ఏర్పాటు చేసుకోవాలి.

ఉద్యాన పంటలు

జీడిమామిడి, మామిడి లేత తోటల్లో మొక్కలకు ఊతం ఇవ్వాలి. వేరు కుళ్లు రాకుండా లీటరు నీటికి కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు కలిపి మొక్కల మొదలు తడపాలి. గాలికి దెబ్బతిన్న, వాలిపోయిన విరిగిన కొమ్మలను ఏటవాలుగా కోసి ఒక శాతం బోర్డో మిశ్రమం లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ పూయాలి. పూత బయటికి వచ్చిన తోటలో శిలీంధ్రం తెగులు ఉధృతి కనిపించిన వెంటనే లీటర్ నీటికి ఒక గ్రాము కార్బెండిజమ్ కలిపి పిచికారీ చేయాలి.

కొబ్బరి తోటలో

తిరగబడిన, సగం విరిగి వేలాడుతున్న ఆకులను కత్తిరించాలి. ఇసుక నేలలో ఈసమయంలో గానోడెర్మా తెగులు వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. దీని నివారణకు ట్రైకో డెర్మా విరిడే 100 గ్రాములు, రెండు కిలోల వేపపిండి, 20 కిలోల పశువుల ఎరువుతో కలిపి మొక్కల పాదులలో వేసుకోవాలి. పోషకలోప నివారణకు 500 గ్రాముల యూరియా, ఒక కిలో సింగిల్ సూపర్‌ఫాస్పేట్, ఒక కిలో మ్యురేట్ ఆఫ్ పొటాషియం బూస్టర్ ఒక్కో చెట్టుకు వేయాలి.

పదోన్నతి ఉత్తర్వులు అందజేత

విజయనగరం రూరల్: జిల్లా పరిషత్ కార్యాలయం పరిధిలో ఇద్దరు రికార్డు అసిసెంట్లను జూనియర్ అసిస్టెంట్లుగా, ఇద్దరు కార్యాలయ సహాయకులకు రికార్డు అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ నియామక ఉత్తర్వులను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కె.రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



పదోన్నతి పత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

7న ఎన్నికల రోల్ అబ్జర్వర్ రాక

- రాజకీయ పార్టీలతో సమావేశం

పార్వతీపురం: ఎన్నికల రోల్ అబ్జర్వర్, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామల రావు ఈనెల 7న వస్తున్నారని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో మధ్యాహ్నం 12.30 గంటలకు ఎన్నికల రోల్ అబ్జర్వర్ సమావేశం నిర్వహిస్తారన్నారు. రోల్ అబ్జర్వర్ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో భాగంగా సూచనలు, సలహాలు,, ఫిర్యాదులను రోల్ అబ్జర్వర్ స్వీకరిస్తారని పేర్కొన్నారు.

రెండు బైక్‌లు ఢీ: ఇద్దరికి గాయాలు

భామిని: మండలంలోని బిల్లుమడ సెంటర్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వాహన చోదకులకు గాయాలయ్యాయి. ఏబీ రోడ్డుపై వెళ్తున్న స్కూటీని గురండి నుంచి భామిని వెళ్తున్న బైక్ ఢీకొనడంతో ఇద్దరూ గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదంలో మూలగూడకు చెందిన చిన్నారావు, బిల్లుమడకు చెందిన అనంతరావులు గాయపడగా రెండు వాహనాలు దెబ్బతిన్నాయి. క్షతగాత్రులను గ్రామస్తులు 108 అంబులెన్స్‌లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భామిని పీహెచ్‌సీలో ప్రాథమిక వైద్య సేవల అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించినట్లు బాధితుల కుటుంబసభ్యులు తెలిపారు.

నేడు జాబ్ మేళా

పార్వతీపురం టౌన్: స్థానిక శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ (ప్రొడక్షన్), కోజెంట్ ఈ సర్వీసెస్ కంపెనీలో బీపీఓ, నిట్ ఐసీఐసీఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్, సోలార్ యాక్టివా సైన్సెస్ కంపెనీలో ప్రొడక్షన్ టెక్నీషియన్, మెడ్స్‌ఫార్మసిస్ట్, ఫార్మసీ ఎయిడ్, ఆడిట్ అసిస్టెంట్, ఇండస్లో టెక్నీషియన్, ఆపరేటర్, ఇసుజు మోటార్స్, సియాన్ ఇ–హెచ్ డబ్ల్యుఏ సుమిత్, శ్రీకాళహస్తి పైప్స్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరగనున్నట్లు తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, డి ఫార్మసీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ– బి.టెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకు జీతంతో పాటు ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులంతా డిసెంబర్ 6న శ్రీ వెంకటేశ్వర గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, పార్వతీపురం వద్ద ఉదయం 9 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్‌లతో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఇతర వివరాలకు ఫోన్ 9440127517, 8297400777 నంబర్స్, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.వికాస జాబ్స్.కామ్‌లో సంప్రదించాలని సూచించారు.

ఫెన్సింగ్ పోటీలు విజయవంతం చేయండి

- బ్రోచర్‌ను ఆవిష్కరించిన జెడ్పీ ఛైర్మన్

విజయనగరం: జిల్లా వేదికగా రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న ఫెన్సింగ్ పోటీలను విజయవంతం చేయాలని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈనెల 8,9,10 తేదీల్లో విజయనగరం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న 10వ సబ్‌జూనియర్స్, 9వ క్యాడెట్ బాల,బాలికల ఫెన్సింగ్ పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను మంగళవారం ఆయన జిల్లా పరిషత్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం ఆనందించదగ్గ విషయమన్నారు. ఇటువంటి పోటీల నిర్వహణ ద్వారా మరింత మంది క్రీడల్లోకి వచ్చేందుకు ఆసక్తి కనబరుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ చీఫ్‌కోచ్ డీవీ చారి ప్రసాద్, కోచ్‌లు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

బైక్ దొంగ అరెస్ట్

విజయనగరం క్రైమ్:

బైక్ చోరీకి పాల్పడిన నిందితుడ్ని వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు విలేకరుల సమావేశం నిర్వహించిన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక తిరుమల ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వచ్చిన మీసాల తాతనాయుడు తన గ్లామర్ మోటార్ బైక్‌ను ఆస్పత్రి వద్ద పార్కు చేసి చికిత్స చేయించుకుని అనంతరం తిరిగి వచ్చి చూసేసరికి బైక్ కనిపించలేదు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నాగవంశం వీధి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న గణేష్‌ను అదుపులోకి తీసుకుని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎస్సై నరేష్, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు(వెనుక ముసుగులో నిందితుడు)

రైతులకు అండగా ప్రభుత్వం



రామచంద్రాపురంలో ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న జేడీ వీటీ రామారావు

దత్తిరాజేరు: తుఫాన్ ప్రభావం వల్ల నూర్పు చేపట్టిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు అండగా ప్రభుత్వం ఉందని జిల్లా వ్యవసాయ శాఖ జేడీ వీటీ రామారావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన దత్తిరాజేరు మండలంలోని రామచంద్రాపురం, ఎస్ చింతలవలస గ్రామాల్లో విక్రయించడానికి సిద్ధంగా ఉన్న 300 క్వింటాళ్ల ధాన్యాన్ని పరిశీలించారు,వెంటనే ఆయా రైతులు వద్ద పత్రాలు తీసుకుని ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేసి పెదమానాపురం వద్ద ఉన్న శ్రీసత్య మోడ్రన్ రైస్ మిల్లుకు తరలించారు. భారీ వర్షంలో కూడా అధికారులు తమ వద్దకు వచ్చి మద్దతు ధర ఇచ్చి ధాన్యం తీసుకెళ్లడంతో రైతులు ఆనందపడ్డారు. ఏడీఏ మహారాజన్, ఏఓ గోవిందమ్మ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దన్నాన త్రినాథరావు వీఏఏ రాము జేడీ వెంట ఉన్నారు.

ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ

బొండపల్లి: తుపాను ప్రభావంతో వరి నూర్పులు చేసి ధాన్యం సిద్ధంగా ఉన్న రైతుల నుంచి నేరుగా ఆఫ్‌లైన్‌లో సేకరించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని వ్యవసాయ శాఖ జిల్లా జేడీ వీటీ రామరావు తెలిపారు. ఈ మేరకు బొండపల్లి మండలంలోని గరుడుబిల్లి, కనిమెరక గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి ధాన్యం పరిశీలించి కొనుగోలు చేశారు. కార్యక్రమంలో గజపతినగరం సబ్ డివిజన్ ఏడీఏ కె.మహారాజన్ , ఏఓ పి.వి.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్ష ప్రాథమిక కీ విడుదల

పార్వతీపురంటౌన్: ఈనెల 3వ తేదీన నిర్వహించిన జాతీయ ఉపకారవేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్) ప్రాథమిక కీ విడుదల చేసినట్లు డీఈఓ ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ పరీక్షకు 1413మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోగా వారిలో 1375మంది (97)శాతం హాజరయ్యారని తెలిపారు. ప్రాథమిక కీని ఈనెల 4వ తేదీన విడుదల చేసి కార్యాలయం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్‌లో ఉంచారన్నారు. ఈ ప్రాథమిక కీ విషయంలో అభ్యంతరాలుంటే ఈనెల 12వ తేదీ సాయంత్రం 5గంటల లోపు కార్యాలయం వెబ్‌సైట్‌లో గల గ్రీవెన్స్ లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

16 వరకు కోరుకొండ ప్రవేశ పరీక్ష ఫీజు గడువు

పార్వతీపురం టౌన్: విజయనగరం జిల్లాలో గల కోరుకొండ సైనిక పాఠశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి 6,9 తరగతుల్లో ప్రవేశానికి జనవరి 21 నిర్వహించనున్న పరీక్షకు ఫీజు చెల్లించడానికి ఈనెల 16వ తేదీ సాయంత్రం వరకు గడువు ఉందని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సాధారణ, డిఫెన్స్, మాజీ సైనికులు, ఇతర వెనుకబడిన తరగతులకు చెందిన అభ్యర్థులకు రూ.650, షెడ్యూల్ కులం, షెడ్యూల్ తెగలకు చెందిన అభ్యర్థులు రూ.500లు పరీక్ష ఫీజు ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే ద్వారా డెబిట్, క్రెడిట్‌కార్డులు, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించాలని పేర్కొన్నారు. .

కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం

- ఆధునిక పద్ధతిలో పెంపకంపై శాస్త్రవేత్తల సహకారం
- రైతులకు ఇంక్యుబేటర్, బ్రూడర్, డూప్లెక్స్‌ల అందజేత



కోళ్లను పెంచే డూప్లెక్స్



పరిశోధన స్థానంలో పెంచుతున్న కోళ్లు



చిన్న పిల్లలను పెంచడానికి రుపొందించిన బ్రూడర్



గుడ్లు పొదిగే ఇంక్యుబేటర్

విజయనగరం ఫోర్ట్: పూర్వకాలంలో ప్రతి రైతు కళ్లం వద్ద, ఇంటి వద్ద నాటు కోళ్లను పెంచేవారు. దీని వల్ల రైతులకు అదనపు ఆదాయం వచ్చేది. కానీ ఇప్పుడు అతి కొద్ది మంది మాత్రమే కోళ్లను పెంచుతున్నారు. గ్రామాల్లో అధికంగా కనిపించే నాటు కోళ్ల ఇప్పుడు చాలా తక్కువగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆధునిక పద్ధతిలో నాటు కోళ్ల పెంపకం చేపట్టడానికి వేలాది రుపాయల విలువ చేసే అవసరమైన పరికరాలను రైతులకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోంది.

ఇంక్యుబేటర్, బ్రూడర్ల అందజేత

నాటుకోళ్లను పెంచుకునేందుకు రైతులకు ఇంక్యుబేటర్లు, బ్రూడర్లు, డూప్లెక్స్‌లను అందజేస్తున్నారు. గుడ్లు పొదిగే మిషన్ ఇంక్యుబేటర్. కోడి పిల్లలను పెంచుకునే పరికరం బ్రూడర్. డూప్లెక్స్‌లో పెద్ద కోళ్లను పెంచుకోవచ్చు.

సమీకృత వ్యవసాయ విధానం ప్రాజెక్టులో అందజేత

సమీకృత వ్యవసాయ విధానం ప్రాజెక్టులో ఉన్న రైతులకు ఇంక్యుబేటర్, బ్రూడర్, డూప్లెక్స్‌లను అందజేస్తున్నారు. ఇంక్యుబేటర్ విలువ రూ.12 వేలు. ఇటువంటి ఇంక్యుబేటర్లు 10 మంది రైతులకు అందజేశారు. డూప్లెక్స్ విలువ రూ.25 వేలు. వాటిని 36మంది రైతులకు అందజేశారు. అలాగే బ్రూడర్ విలువ రూ.12 వేలు. 10మంది రైతులకు బ్రూడర్లు అందజేశారు.

ఆధునిక పద్ధతిలో కోళ్ల పెంపకం

సాధారణ పద్ధతిలో కోళ్ల పెంపకం అపరిశుభ్రంగా ఉంటుంది. కోళ్ల మల విసర్జన వల్ల దుర్వాసన వెదజల్లుతుంది. గుడ్లు పొదగడానికి బుట్ట కడతారు. ఇది ఇంట్లో పెట్టడం వల్ల కూడా దుర్వాసన వస్తుంది. ఈనేపథ్యంలో పరిశుభ్రమైన వాతావరణంలో కోళ్లను పెంచడం కోసం ఇంక్యుబేటర్, బ్రూడర్, డూప్లెక్సులను వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త ఎం.వి.శ్రీనివాస్ రూపొందించి రైతులకు అందించారు. వాటిలో కోళ్ల పెంపకం చేపట్టి రైతులు ఆదాయాన్ని పొందే అవకాశం ఉంది.